శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:50 సూర్యాస్తమయం - సా. 6:10 తిథిఃజి నవమి రా. 10:55 వరకు తరువాత దశమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం కృతిక రా. 7:30 వరకు తరువాత రోహిణి యోగం బ్రహ్మ సా. 6:35 వరకు కరణం భాలవ ఉ. 11:44 వరకు కౌలవ రా. 10:55 వరకు వర్జ్యం ఉ. 8:01 నుండి ఉ. 9:33 వరకు దుర్ముహూర్తం ఉ. 10:36 నుండి ఉ. 11:22 వరకు మ. 3:08 నుండి మ. 3:54 వరకు రాహుకాలం మ. 1:55 నుండి మ. 3:20 వరకు యమగండం ఉ. 6:50 నుండి ఉ. 8:15 వరకు గుళికాకాలం ఉ. 9:40 నుండి ఉ. 11:05 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:14 నుండి ఉ. 6:02 వరకు అమృత ఘడియలు సా. 5:11 నుండి సా. 6:43 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:52 వరకు

e-paper

# ఈ -కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హిమాలయాల్లో రెస్టారెంట్ ప్రారంభించిన స్టార్ హీరోయిన్



సినీ కబుర్లు

గురువారం | 6-2-2025 | హైదరాబాద్ | e-kaburu.com

# కుంభమేళాకు మోదీ..

## త్రివేణీ సంగమంలో ప్రధాని పుణ్యస్నానం

- గంగానదికి హారతి ఇచ్చి పూజలు నిర్వహించిన ప్రధాని
- బోటు ద్వారా ఘాట్ ప్రాంతానికి చేరుకున్న మోదీ
- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి పుణ్యస్నానం
- ఫిబ్రవరి 26 వరకు వేడుకలు కొనసాగనున్న మహా కుంభమేళా
- ఇప్పటికే 38 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానం ఆచరించారని అంచనా
- ప్రయాగ్‌రాజ్ అభివృద్ధికి రూ. 5500 కోట్లతో కొత్త ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన



*ప్రపంచంలోని అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహా కుంభమేళాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. కొద్దిసేపటి క్రితం ఈ వేడుక జరుగుతోన్న ప్రయాగ్‌రాజ్ చేరుకున్న ఆయన రుద్రాక్షలు చేతబూని త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానం ఆచరించారు. తర్వాత గంగానదికి హారతి ఇచ్చి, పూజలు నిర్వహించారు.*

**ఈ-కబురు,ప్రయాగ్‌రాజ్**

ఫిబ్రవరి 05 : తొలుత ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయంలో దిగిన ప్రధాని మోదీ అక్కడి నుంచి అరైల్ ఘాట్‌కు వెళ్లారు. ఘాట్ నుంచి బోటులో ప్రయాణించి మహాకుంభమేళా జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం త్రివేణీ సంగమంలో ప్రధాని పుణ్యస్నానం ఆచరించారు. దానికి ముందు అక్కడి బోటులో ప్రయాణించారు. స్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులకు బోటు నుంచే అభివాదం చేశారు. అప్పుడు ఆయన వెంట



యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా ఉన్నారు. 144 ఏళ్లకోసారి వచ్చే ఈ మహా కుంభమేళా జనవరి 13న ప్రారంభం కాగా.. భారత్‌తోపాటు విదేశాల నుంచి భారీసంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. ఫిబ్రవరి 26 వరకు ఈ వేడుక జరగనుంది. ఇప్పటివరకు పలువురు రాజకీయ, సినీ,

(మిగతా 2 వ పేజీలో)



## త్రిషకు రూ.కోటి నజరానా ప్రకటించిన

# సీఎం రేవంత్ రెడ్డి

### అండర్-19 మహిళల వరల్డ్ కప్ విజేత జట్టులో త్రిష గొంగడి కీలక పాత్ర

- జూబ్లీహిల్స్ నివాసంలో త్రిషను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి
- "భవిష్యత్తులో దేశం తరఫున మరింత రాణించాలి" - సీఎం ఆకాంక్ష
- క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ
- ఇతర క్రీడాకారులకు ఆర్థిక సహాయం
- అండర్-19 వరల్డ్ కప్ జట్టు సభ్యురాలు ధృతి కేసరికి రూ.10 లక్షలు
- జట్టు హెడ్ కోచ్ నౌషీన్, ట్రైనర్ షాలినికి రూ.10 లక్షల చొప్పున నజరానా
- క్రీడా అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుందన్న సీఎం



**తెలంగాణకు చెందిన అండర్-19 మహిళల క్రికెటర్ త్రిష గొంగడి అద్భుత ప్రదర్శనతో ప్రపంచ కప్ గెలుచుకున్న భారత జట్టులో కీలక పాత్ర పోషించింది.**

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 05 : తెలంగాణకు చెందిన అండర్-19 మహిళల క్రికెటర్ త్రిష గొంగడి అద్భుత ప్రదర్శనతో ప్రపంచ కప్ గెలుచుకున్న భారత జట్టులో కీలక పాత్ర పోషించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమెను తన జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి త్రిష భవిష్యత్‌లో దేశం తరఫున మరింత పెద్ద స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని

(మిగతా 2 వ పేజీలో)



## రాహుల్ గాంధీ కాదు..

# ఎలక్షన్ గాంధీ

- బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ అబద్ధాల ప్రచారం
- అసెంబ్లీలో సమర్పించిన డేటాపై రాష్ట్ర సర్కారుకు స్పష్టత లేదని విమర్శ
- బీసీలకు 42% రిజర్వేషన్‌పై కాంగ్రెస్‌కు నిజమైన ఉద్దేశం లేదని ఆరోపణ
- రిజర్వేషన్ అంశంపై కాంగ్రెస్ యూటర్న్ తీసుకుందని మండిపాటు
- రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలు, డిక్లరేషన్లు బూటకమని వ్యాఖ్య

**తెలంగాణలో బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ సర్కారు పూర్తిగా అబద్ధాలను ప్రచారం చేసిందని ఆరోపించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అసెంబ్లీలో సమర్పించిన డేటాపై రాష్ట్ర సర్కారుకు ఏమాత్రం క్లారిటీ లేదు అంటూ ఆసక్తికర కామెంట్స్ చేశారు.**

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 05 : తెలంగాణలో బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ సర్కారు పూర్తిగా అబద్ధాలను ప్రచారం చేసిందని ఆరోపించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అసెంబ్లీలో సమర్పించిన డేటాపై రాష్ట్ర సర్కారుకు ఏమాత్రం క్లారిటీ లేదు అంటూ ఆసక్తికర కామెంట్స్ చేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన ఎన్నికల హామీలు, చెప్పిన గ్యారంటీలు, చేసిన డిక్లరేషన్లన్నీ బూటకమని తేలిపోయింది అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ తాజాగా అసెంబ్లీ సమావేశంపై స్పందించారు.

(మిగతా 2 వ పేజీలో)

## హైబ్రీడ్ అన్యూటీ మోడ్ రోడ్ల నిర్మాణంలో

# వేగం పెంచాలి..

- హ్యామ్ రోడ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచనలు
- మండలం నుండి జిల్లా కేంద్రం, జిల్లా కేంద్రం నుండి రాష్ట్ర రాజధానికి మిస్సింగ్ లింక్ రోడ్ల నిర్మాణంపై దృష్టి
- కన్సల్టెంట్లకు అనవసరమైన సమయం ఇవ్వకుండా తక్షణమే పనులు ప్రారంభించాలని మంత్రి స్పష్టం
- రోడ్ల నిర్మాణంలో డివైడర్లు, లైటింగ్, విస్తరణపై ప్రామాణిక మార్గదర్శకాలు పాటించాలని ఆదేశాలు
- 15 ఏళ్ల వరకు నిర్మాణ సంస్థలే రోడ్లను మెయింటెయిన్ చేయాలని స్పష్టం
- "ప్రజల కష్టం తప్పించడానికి రోడ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలి" - మంత్రి కోమటిరెడ్డి

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 05 : రాష్ట్రంలో హైబ్రీడ్ అన్యూటీ మోడ్ రోడ్ల నిర్మాణంలో వేగం పెంచాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు.సచివాలయంలో హ్యామ్ (హైబ్రిడ్ అన్యూటీ మోడ్) రోడ్లపై ఆర్ బీ అధికారులతో జరిగిన రివ్యూలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడారు.రాష్ట్రంలో హైబ్రీడ్ అన్యూటీ మోడ్ రోడ్ల నిర్మాణంలో వేగం పెంచాలని అధికారులను



ఆదేశించించారు. నియమ, నిబంధనలకు అనుగుణంగా హ్యామ్ రోడ్ల నిర్మాణం చేయాలని అధికారులకు సూచించించారు. మండలం నుంచి జిల్లా కేంద్రానికి మిస్సింగ్ లింక్ రోడ్లు, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధానికి మిస్సింగ్ లింక్ రోడ్లు, అప్ గ్రేడేషన్ వంటి మూడు విభాగాలుగా నిర్మాణం చేపట్టాలన్నారు. హ్యామ్ రోడ్ల నిర్మాణంలో కన్సల్టెంట్లను గుర్తించి, డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు.

(మిగతా 2 వ పేజీలో)

# అబ్బురపడేలా.. జేబీఎస్ మెట్రో హబ్



- పీపీపీ పద్ధతిలో మెట్రో టెర్మినల్
- అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి
- షాపింగ్ మాల్స్, రెస్టారెంట్లు, కార్యాలయాలు
- మోడల్ మెట్రో స్టేషన్‌గా విస్తరణ
- ప్రణాళికలు రూపొందిస్తున్న హెచ్ఎంఆర్ఎల్

2



## విధ్వంసకర శతకం..

రెండో స్థానానికి దూసుకొచ్చిన అభిషేక్ శర్మ

ఆట



## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

బిజినెస్

# అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 05 : తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. కరీంనగర్, నిజామాబాద్, మెదక్, అదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికపై బీజేపీ సమావేశం నిర్వహించింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహం, ఓటర్‌ను నేరుగా కలవడం, అభ్యర్థి నామినేషన్‌పై చర్చించారు. ఈ కార్యక్రమానికి కిషన్ రెడ్డి, ఎమ్మెల్సీ పరిధిలోని




జిల్లాల అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఎన్నిక అసెంబ్లీ ఇన్‌చార్జ్‌లు, జిల్లా ఇన్‌చార్జ్‌లు, రాష్ట్ర స్థాయి సమన్వయ కర్తలు హాజరయ్యారు.

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్‌ది ప్రచార ఆర్భాటమే తప్ప.. ఏ వర్గానికి రాష్ట్రంలో మేలు చేయలేదని ధ్వజమెత్తారు. మహిళలు, రైతులు, కార్మికులు, యువత అంతా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నారని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకు ఇన్‌కం ట్యాక్స్ మినహాయింపు చాలా విప్లవాత్మక నిర్ణయమని కొనియాడారు. ఇది ప్రజల్లోకి చాలా బలంగా తీసుకెళ్లాలని కోరారు. పేద, మధ్య తరగతికి మేలు చేసే కేంద్ర బడ్జెట్‌ను ప్రజలకు వివరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో బీజేపీకి ఉన్న సానుకూల పరిస్థితుల్లో మూడుకి మూడు ఎమ్మెల్సీ స్థానాలు గెలవాలని కార్యకర్తలకు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# కుంభమేళాకు మోదీ..

(మొదటి పేజీ తరువాయి)



వ్యాపారరంగాలతో పాటు పలువురు ప్రముఖులు, సామాన్య పౌరులతో కలిపి 38 కోట్లమంది పుణ్యస్నానాలు ఆచరించారు. ఈరోజు కేంద్రమంత్రి కిరణ్ రిజిజు పుణ్యస్నానమాచరించారు. ఈ చరిత్రాత్మక సమయంలో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. భారీ సంఖ్యలో ప్రజలు తరలివస్తోన్న తరుణంలో ప్రతిఒక్కరూ మార్గదర్శకాలను అనుసరించాలని సూచించారు.

మహా కుంభమేళా ప్రారంభానికి ముందు ప్రధాని మోదీ ప్రయాగ్‌రాజ్ వెళ్లిన సంగతి తెలిసిందే. రూ.5500 కోట్లతో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.



జీహెచ్ఎంసీకి ఎంపీ రఘునందన్‌రావు

# సీరియస్ వార్నింగ్

సంగారెడ్డి జిల్లాను మరో జవహర్‌నగర్‌గా మార్చాలని చూస్తున్నారని,శుద్ధి పేరుతో నల్లవల్లి ఫారెస్ట్‌లో రోజుకు వంద లారీల చెత్త పోసేందుకు జీహెచ్ఎంసీ ప్లాన్ చేస్తోందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. ఈ మేరకు రఘునందన్‌రావు బుధవారం(ఫిబ్రవరి5) మీడియాతో మాట్లాడారు.'చెత్త పోసే వ్యవహారాన్ని ఆపేందుకు ప్రయత్నిస్తున్న ప్రజా ప్రతినిధులను అడ్డుకుంటున్నారు.

**ఈ-కబురు,సంగారెడ్డి**

ఫిబ్రవరి 05 : పటాన్ చెరువు ప్రాంతం ఇప్పటికే కంపెనీలతో కలుషితం అయింది.2015లో అప్పటి ప్రభుత్వం దీనికి పర్మిషన్ ఇచ్చిందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. నలవల్లిలో చెత్త శుద్ధి పనులు ఆపకపోతే అధికారులకు భౌతిక దాడులు తప్పవు.పట్నం చెత్తను పల్లెలో వేస్తామంటే ఊరుకోం. అరెస్ట్ చేసిన నాయకులందరినీ వెంటనే విడుదల చేయాలి. పచ్చని అడవుల్లో చెత్త వేసి భూములు కలుషితం చేస్తామంటే ఊరుకునేది లేదు. దీన్ని ఉపసంహరించుకోకుంటే ప్రత్యక్ష నిరసనకు దిగుతాం.పోలీసులతో ప్రజలను భయపెట్టి పనులు చేపట్టడం సరికాదు.చెత్తకు హైదరాబాద్,రంగారెడ్డి అయిపోయింది ఇప్పుడు సంగారెడ్డి మీద పడ్డారా'అని రఘునందన్‌రావు నిలదీశారు.



# అబ్బురపడేలా.. జేబీఎస్ మెట్రో హబ్

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 05 : జేబీఎస్ మెట్రో స్టేషన్ ప్రపంచస్థాయి మెట్రో హబ్‌గా అవతరించనుంది. సింగపూర్, టోక్యో వంటి అంతర్జాతీయ నగరాల్లోని మెట్రో హబ్‌లకు దీటుగా జేబీఎస్ మెట్రో హబ్‌కు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ సంస్థ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇక్కడ బస్ స్టేషన్‌లు, పార్కింగ్ సదుపాయం, రెస్టారెంట్‌లు, మల్టీప్లెక్స్ థియేటర్‌లు, మాల్స్, కార్యాలయాలు వంటి అన్ని సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. కేవలం మెట్రో రైళ్ల రాకపోకలకే పరిమితం కాకుండా చక్కటి షాపింగ్, డైనింగ్ కేంద్రంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జేబీఎస్ హబ్‌పై దిశానిర్దేశం చేసినట్లు అధికారులు తెలిపారు.పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో జేబీఎస్ మెట్రో హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. మెట్రో రెండో దశలో భాగంగానే సికింద్రాబాద్ నుంచి మేడ్చల్, శామీర్‌పేట్ వరకు మెట్రో విస్తరణ చేపట్టనున్నారు. ఈ మేరకు కొద్దిరోజుల క్రితం హెచ్ఏఎంఆర్ఎల్ అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. ఈ రెండు కారిడార్‌లపైనా సీఎం తాజాగా సమీక్షించారు.

**అతిపెద్ద ప్రాంగణంగా విస్తరణ..**

సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో జేబీఎస్ మెట్రో హబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ప్రస్తుతం మెట్రోకు జేబీఎస్ వద్ద అందుబాటులో ఉన్న స్థలంతో పాటు రక్షణ శాఖకు చెందిన భూములను కూడా సేకరించనున్నారు. ప్రస్తుతం నగరంలోని మెట్రోస్టేషన్‌ల పార్కింగ్ సదుపాయాలు అరకొరగా ఉన్నాయి. దీంతో మెట్రోల్లో ప్రయాణం చేయాలని భావించినప్పటికీ.. పార్కింగ్ వసతులు లేకపోవడంతో చాలామంది సొంత వాహనాలనే వినియోగిస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో నిర్మించనున్న మెట్రో స్టేషన్‌లను పార్కింగ్ సదుపాయాలతో ప్రత్యేకంగా డిజైన్ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు జేబీఎస్ మెట్రో హబ్ వద్ద సెల్లార్‌లో అతిపెద్ద పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయనున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాల కోసం రెండంతస్తుల్లో నిర్మించే అవకాశం ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో బస్‌స్టేషన్ ఉంటుంది. ప్రయాణికులు బస్సు దిగి నేరుగా మెట్రో స్టేషన్‌కు వెళ్లవచ్చు.వివిధ ప్రాంతాల మధ్య లాస్ట్‌మైల్, ఫస్ట్‌మైల్ కనెక్టివిటీకి కూడా పార్కింగ్, బస్‌స్టేషన్ సదుపాయాలు దోహదం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



త్రిషకు రూ.కోటి నజరానా ప్రకటించిన

# సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

తెలియజేసిన సీఎం, త్రిష గొంగడికి రూ. 1 కోటి నజరానా ప్రకటించారు.


**ఇతర క్రికెటర్లకు కూడా ఆర్థిక సహాయం**

అండర్-19 వరల్డ్ కప్ జట్టు సభ్యురాలైన తెలంగాణ క్రికెటర్ ధృతి కేసరికి రూ. 10 లక్షలు, జట్టు హెడ్ కోచ్ నౌషీన్, ట్రైనర్ షాలినికి రూ. 10 లక్షల చొప్పున నజరానా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాట్స్ చైర్మన్ శివసేన రెడ్డి, సీఎం కార్యదర్శి షానవాజ్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు అన్ని విధాలా తోడ్పాటును అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

హైబ్రీడ్ అన్యూటీ మోడ్ రోడ్ల నిర్మాణంలో

# వేగం పెంచాలి..

(మొదటి పేజీ తరువాయి)



మంచిగా ఉన్న రోడ్లను హ్యామ్ లోకి తీసుకువస్తే కన్సల్టెంట్లే బాగుపడుతరు కాబట్టి, అధికారులు హ్యామ్ రోడ్లను గుర్తించే క్రమంలో.. అత్యంత దారుణంగా ఉండి, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న రోడ్లకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు.రోడ్ల నిర్మాణంలో డివైడర్లు, లైటింగ్, రోడ్డు విస్తరణ, పేవ్ డ్ షోల్డర్స్ ఏర్పాటులో ప్రభుత్వ గైడ్ లైన్స్ పాటించేలా పకడ్బందీగా వ్యవహరించాలని తేల్చి చెప్పారు. 15 ఏండ్ల పాటు హ్యామ్ రోడ్డు తీసుకున్న సంస్థే పూర్తిగా మెయింటినెన్స్ చేయాల్సి ఉన్నందున రోడ్డు నాణ్యతలో రాజీపడకుండా ఉండేలే ప్రతీ ఇంజనీర్ జాగ్రత్తగా పనులను తనిఖీ చేయాలని సూచించాలన్నారు.ఇప్పటి వరకు మట్టి రోడ్డుగా ఉన్న రోడ్లను గుర్తిస్తే.. తన దృష్టికి తీసుకువస్తే వెంటనే మంజూరీ చేస్తానని అధికారులకు చెప్పారు.అటవీ అనుమతులతో మట్టిరోడ్లుగా ఉన్న రహదారులను భవిష్యత్తులో బీటీగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజాధనంతో నిర్మిస్తున్న రహదారుల నిర్మాణంలో ఎక్కడా రాజీలేదని.. నాణ్యతలేని పనులు చేస్తే వెంటనే పనులను రద్దు చేస్తామని హెచ్చరించారు.హ్యామ్ రోడ్ల నిర్మాణాలకు సమయం కావాలని అడిగిన కన్సల్టెంట్ల అభిప్రాయాలను తోసిపుచ్చిన మంత్రి.. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. సంవత్సరం సమయం తీసుకుంటే ప్రమాదాల్లో చనిపోతే ఏవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు.ఏ రోడ్డు నిర్మాణమైన రెండు, మూడు నెలల్లో ప్రారంభించేలా వేగంగా ముందుకు వెళ్లాలని ఆర్డర్. హ్యామ్ రోడ్ల మంజూరీ రాష్ట్ర పరిధిలోనే ఉన్నందును ఆర్ %డ% బీ డిపార్ట్ మెంట్ వేగంగా అనుమతులు మంజూరీ చేస్తుందని.. కాబట్టి వెంటనే సర్వే, టెండర్ పూర్వ పనులను ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ స్థాయిలో స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయలను తీసుకోని ఎస్.ఈ., ఈఈ తో పాటు ఇతర అధికారులను కలుపుకొని హ్యామ్ రోడ్ల ను ఎంపిక చేసే ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.వర్షాలు, దశాబ్ద కాలంగా మరమ్మత్తులకు నోచుకోని రహదారులను తక్షణమే ఎస్టిమేట్స్ సిద్ధం చేసి షార్ట్ టెండర్స్ పిలిచి పనులు ప్రారంభించాలన్నారు.ఇప్పటి వరకు 82 నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు గుర్తించిన 1690.26 కిలోమీటర్ల రోడ్ల రిపేర్ల పనులను వెంటనే ప్రారంభించేలా టెండర్ పూర్వప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు.సర్వీస్ రూల్స్ ప్రక్రియ పూర్తి చేసి ఇప్పటికే ఏఈఈ లను డీఈఈలుగా ప్రమోషన్లు ఇచ్చామని, ఈ నెలాఖరుకల్లా డీఈఈ, ఈఈ, ఎస్ఈ లకు ప్రమోషన్లు ఇచ్చే విధంగా కసరత్తు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.ఈ రివ్యూలో ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, స్పెషల్ సెక్రటరీ శ్రీమతి దాసరి హరిచందన, సీఈ (అడ్మిన్) తిరుమల, సీఈ (స్టేట్ రోడ్స్) మోహన్ నాయక్, వివిధ జిల్లాల ఎస్ఈ లు, ఈఈలు ఇతర అధికారులు.

# ..ఎలక్షన్ గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా కేటీఆర్..'నిన్నటి అసెంబ్లీ సమావేశం.. తెలంగాణ ప్రజలకు రెండు విషయాలు స్పష్టంచేసింది. ఏడాది కాలంగా పూర్తిగా విఫలమవుతున్న ప్రభుత్వానికి దేనిపై కూడా స్పష్టత లేదు. బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ సర్కారు పూర్తిగా అబద్ధాలను ప్రచారం చేసింది. అసెంబ్లీలో సమర్పించిన డేటాపై రాష్ట్ర సర్కారుకు ఏమాత్రం క్లారిటీ లేదు.బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి ఎంతమాత్రం లేదని నిన్నటితో తేలిపోయింది. రిజర్వేషన్ల అంశంపై నిస్సిగ్గుగా కాంగ్రెస్ పార్టీ యూటర్న్ తీసుకుంది. కేంద్రంపైకి నెపం నెట్టి తప్పించుకోవాలని పన్నాగం వేసింది. రాహుల్ గాంధీ ఇచ్చిన ఎన్నికల హామీలు,



చెప్పిన గ్యారంటీలు, చేసిన డిక్లరేషన్లన్నీ బూటకమని తేలిపోయింది. అబద్ధాలు ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ది పొందడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న రాహుల్ గాంధీ తన పేరును ఎలక్షన్ గాంధీగా మార్చుకుంటే మంచిది. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ వంద శాతం అబద్ధం.. ఈ సర్కారు నిబద్ధత వంద శాతం నకిలీ' అంటూ ఘాటు విమర్శలు చేశారు.

# శాసన సభ ప్రాంగణంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్..

- కమిటీ హాల్‌లో సబ్ కమిటీ చైర్మన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్
- దేశంలో తొలిసారి ప్రామాణికంగా బీసీ కుల గణన నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వం
- ప్రతిపక్షాలు అనుమానాలు, అపోహలు సృష్టిస్తున్నాయి - గుత్తా సుఖేందర్ రెడ్డి
- సంక్షేమ పథకాలు నిజమైన పేదలకు చేరాలంటే సమన్వయంతో ముందుకు వెళ్లాలి




**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 05 : తెలంగాణ శాసన సభ ప్రాంగణంలోని కమిటీ హాల్ లో బిసి కుల గణన సబ్ కమిటీ చైర్మన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , తెలంగాణ శాసన సభ స్పీకర్ ప్రసాద్ కుమార్ , మంత్రులు పొన్నం ప్రభాకర్ , పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ , ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు , సంబంధిత అధికారులు పాల్గొన్నారు . ఈ సమావేశంలో తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ " దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించని విధంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బిసి కుల గణన సర్వేను నిర్వహించిందన్నారు. అధికారులు తూతుమంత్రంగా కాకుండా ప్రామాణికంగా , పక్కాగా సర్వే నిర్వహించారని వివరించారు. తాను కూడా తన కుటుంబ వివరాలను తన సొంత గ్రామంలో అధికారులకు అందించినట్లు తెలిపారు. కావాలనే కొందరు ప్రతిపక్ష నేతలు అనుమానాలు, అపోహలు సృష్టించే విధముగా మాట్లాడుతున్నారని చెప్పారు.

ప్రజలు ఎవరు కూడా వారి మాటలను నమ్మవద్దని , అపోహలకు గురికావాల్సిన అవసరం అసలే లేదన్నారు. రాష్ట్ర , జిల్లా , మండల , గ్రామ స్థాయిలో అధికారులు , ప్రజా ప్రతినిధులు ప్రజలకు అర్థం అయ్యే విధంగా గణాంకాలను వివరించాలని ఆయన సూచించారు. నిజమైన పేద వారికి సంక్షేమ పథకాలు అందాలి అంటే ప్రభుత్వ అధికారులు , ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఆయన కోరారు. ఉమ్మడి రాష్ట్రాల్లో ఉన్న మాదిరిగా ఏపీ ఎల్, బీపీ ఎల్ రేషన్ కార్డ్స్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.

## హాస్టల్ భవనంపై నుంచి దూకి
# సాఫ్ట్వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**



అనారోగ్య కారణాలతో ఓ సాఫ్ట్వేర్ ఉద్యోగిని తాను నివాసం ఉంటున్న హాస్టల్ భవనంపై నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకుంది. మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... వెస్ట్ బెంగాల్‌కు చెందిన రిటోజా బసు(22) మాదాపూర్ లోని ఓ సాఫ్ట్వేర్ సంస్థ లో సాఫ్ట్వేర్ ఉద్యోగిగా పనిచేస్తుంది. తన స్నేహితురాలు, సాఫ్ట్వేర్ ఉద్యోగి హర్ష తో కలిసి సిద్ధిక్‌నగర్‌లోని జోలో స్టెర్లింగ్ కో లివింగ్ హాస్టల్‌లో ఉంటుంది. ఈ నెల 03వ తేదిన రాత్రి 10.30 గంటల సమయంలో తాను నివాసం ఉంటున్న హాస్టల్ బిల్డింగ్ 6వ ఫ్లోర్ నుండి కిందకు దూకుంది. తీవ్ర గాయాలతో ఉన్న రిటోజా బసును స్థానికులు, హాస్టల్ నిర్వాహకులు సమీపంలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఇంద్రజిత్ బసు ఇచ్చిన కంప్లైంట్ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అయితే రిటోజా బసు అనారోగ్య కారణాలతోనే బిల్డింగ్‌పై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.


# గాజాపై ట్రంప్ సంచలన ప్రకటన





**ఈ-కబురు,వాషింగ్టన్**

ఫిబ్రవరి 05 : గాజాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. తాజాగా ట్రంప్.. ఇజ్రాయెల్, గాజా యుద్ధం తాజా పరిస్థితిపై చర్చించారు. అనంతరం, గాజాను స్వాధీనం చేసుకోవాలని భావిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. దీంతో, ట్రంప్ వ్యాఖ్యలు కొత్త చర్చకు దారి తీశాయి. ఇక, ఇప్పటికే ఇజ్రాయెల్ యుద్ధంపై ట్రంప్ కీలక ప్రకటన చేశారు. యుద్ధం ముగింపు దిశగా వెళ్లాలని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్, గాజా యుద్ధం తాజా పరిస్థితిపై నెతన్యాహూతో ట్రంప్ చర్చించారు. అనంతరం ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. యుద్ధంతో దెబ్బతిన్న పాలస్తీనాలో భూభాగమైన గాజాను అమెరికా స్వాధీనం చేసుకోవాలని భావిస్తుందని తెలిపారు. అక్కడ ధ్వంసమైన భవనాలను పునరుద్ధరిస్తాం. ఆ ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తే.. అక్కడి ప్రజలకు అపరిమిత సంఖ్యలో ఉద్యోగాలు, ఇళ్లు కల్పించవచ్చు అని తెలిపారు. ఇదే సమయంలో భవిష్యత్తులో మిడిల్ ఈస్ట్ పర్యటన సందర్భంగా గాజా, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాను సందర్శించాలని తాను భావిస్తున్నట్టు తెలిపారు.మరోవైపు.. ట్రంప్ నిర్ణయంపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పందించారు. గాజాపై ట్రంప్ ప్రకటన చరిత్రను మారస్తుందని తన అభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో, ఇరువురి వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.ఇదిలా ఉండగా.. గాజాలో ఉద్రిక్తతల కారణంగా నిరాశ్రయులుగా మారిన పాలస్తీనీయులకు అరబ్ దేశాలు ఆశ్రయం కల్పించాలని ఇటీవల ట్రంప్ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ప్రతిపాదనను ఆయా దేశాలు తీవ్రంగా ఖండించాయి. అలా చేస్తే తమ ప్రాంతంలోని స్థిరత్వం దెబ్బతింటుందని ఈజిప్టు, జోర్డాన్, సౌదీఅరేబియా, యూఏఈ, ఖతార్, పాలస్తీనా అథారిటీ, అరబ్ లీగ్‌లు సంయుక్తంగా ప్రకటన చేశాయి. ఈక్రమంలోనే గాజాను స్వాధీనం చేసుకొని, అభివృద్ధి చేస్తామని ట్రంప్ ప్రకటించడం గమనార్హం.



# చంద్రునిపైకి ఫ్లయింగ్ రోబో

**ఈ-కబురు,బీజింగ్**

ఫిబ్రవరి 05 : చంద్ర మండల అన్వేషణలో జోరుగా ముందుకు సాగుతున్న చైనా త్వరలో ప్రతిష్టాత్మక 'చాంగే-7' ప్రయోగాన్ని చేపట్టేందుకు సిద్ధమవుతున్నది. చంద్రుని దక్షిణ ధృవంలో నీటి జాడలను కనుగొనేందుకు 6 కాళ్లతో కూడిన ఓ ఫ్లయింగ్ రోబోను పంపబోతున్నట్టు 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' పత్రిక వెల్లడించింది.

'చాంగే-7' మిషన్‌లో అధునాతన 'ఫ్లయింగ్ డిటెక్టర్' రాకెట్ ప్రొపల్షన్‌ను ఉపయోగించుకుని పాకడం, దూకడం, పైకి ఎగరడం ద్వారా గతంలో ఎవరూ ప్రవేశించలేని ప్రాంతాలను అన్వేషించగలుగుతుంది.

# నోటీసుల విషయంలో సమాలోచనలు

## దానం నాగేందర్ ఇంట్లో ఫిరాయింపు ఎమ్మెల్యేల!

**ఈ-కబురు,బంజారాహిల్స్**



ఫిబ్రవరి 05 : కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంతో, పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇంట్లో భేటీ అయ్యారు. వీరిలో కడియం శ్రీహరి, అరికెపూడి గాంధీ, కాలే యాదయ్య, సంజయ్ కుమార్, ప్రకాశ్ గౌడ్, బండ్ల కృష్ణమోహన్, గూడెం మహిపాల్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెల్లం వెంకట్రావు ఉన్నారు. వీరితోపాటు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి కూడా భేటీలో పాల్గొన్నారు. ఫిరాయింపుల వ్యవహారంలో ఎలా వ్యవహరించాలనే అంశంపై వీరు ప్రధానంగా చర్చిస్తున్నారు. అందరూ ఢిల్లీకి వెళ్లి అక్కడ సమాలోచనలు చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమిపాలయింది. దీంతో,పది మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లోకి వచ్చారు. ఈ ఫిరాయింపులపై తెలంగాణ హైకోర్టును బీఆర్ఎస్ పార్టీ ఆశ్రయించింది. హైకోర్టులో అనుకూలంగా తీర్పు రాకపోవడంతో సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్ వెళ్లింది. బీఆర్ఎస్ పిటిషన్ ను విచారించిన సుప్రీంకోర్టు%ొ% ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలోనే వీరందరికీ నోటీసులు జారీ అయ్యాయి.

# ఢిల్లీ పీఠం బీజేపీదే.. స్పష్టం చేసిన ఎగ్జిట్ పోల్స్..!

**ఈ-కబురు,ఢిల్లీ**

ఫిబ్రవరి 05 : దేశ రాజధాని ఢిల్లీలో ఓటింగ్ ముగిసింది. 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో ఎన్నికలు జరిగాయి. సాయంత్రం 5 గంటల వరకు 57.70శాతం ఓటింగ్ నమోదైంది. ఓటింగ్ ముగిసిన నేపథ్యంలో పలు సంస్థలను ఎగ్జిట్ పోల్స్ వివరాలను ప్రకటించాయి. ఈ సారి ఢిల్లీ పీఠం బీజేపీదేనని మెజారిటీ సంస్థల ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. జేవీసీ పోల్ బీజేపీకి 39-45, ఆమ్ ఆద్మీ పార్టీకి 32-31, కాంగ్రెస్‌కు 0-2 సీట్లు వస్తాయని అంచనా వేసింది. టైమ్స్ నౌ బీజేపీకి 39-45, ఆప్‌కి 22-31, కాంగ్రెస్‌కు 0-2 సీట్లు వస్తాయని ఎగ్జిట్ పోల్స్‌లో పేర్కొంది. మ్యాట్రిక్స్ సంస్థ ఆప్‌కు 32-37, బీజేపీకి 35-40, కాంగ్రెస్‌కు 0-1 వస్తాయని అంచనా వేసింది. చాణక్య స్ట్రాటజీ సర్వే ఆప్‌కు 25-28, బీజేపీకి 39,45, కాంగ్రెస్‌కు 2-3 సీట్లు వస్తాయని చెప్పింది. పీపుల్స్ పల్స్ కాంగ్రెస్‌కు ఆప్‌కు 10-19, బీజేపీకి 51-60 వస్తాయని అంచనా వేసింది. పీపుల్స్ ఇన్‌సైట్ ఆప్‌కు 25-29, బీజేపీకి 40-44, కాంగ్రెస్‌కు 0- ఒక స్థానాల్లో గెలిచే అవకాశాలున్నాయని అంచనా వేశాయి.

70 అసెంబ్లీ స్థానాలున్న ఢిల్లీలో మొత్తం 699 మంది అభ్యర్థులు బరిలోకి దిగారు. ఈ సారి మాజీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ



స్థానం నుంచి బరిలోకి దిగారు. కాంగ్రెస్‌కు చెందిన సందీప్ దీక్షిత్, బీజేపీకి చెందిన ప్రవేశ్ వర్మ సైతం ఇదే స్థానం నుంచి బరిలోకి దిగారు. ఢిల్లీ సీఎం అతిషి మర్లేనా కల్కాజీ స్థానం నుంచి మళ్లీ బరిలోకి దిగారు. ఈ స్థానం నుంచి బీజేపీ నుంచి రమేశ్ బిధురి పోటీ చేస్తున్నారు.

### 2015 ఎగ్జిట్ పోల్స్ ఇలా..

2015 అసెంబ్లీ ఎన్నికల్లో, ఆరు సర్వే ఏజెన్సీల ఎగ్జిట్ పోల్స్ ఆమ్ ఆద్మీ పార్టీకి స్పష్టమైన మెజారిటీ వస్తుందని చెప్పాయి. అయితే, ఏ ఎగ్జిట్ పోల్స్ కూడా ఆప్ కు భారీ విజయాన్ని అంచనా వేయలేకపోయాయి. కేజ్రీవాల్ నేతృత్వంలోని పార్టీ 45 సీట్లు గెలుచుకుంది. బీజేపీకి 24 సీట్లు, కాంగ్రెస్ కేవలం ఒక సీటు మాత్రమే గెలుస్తుందని అంచనా వేసింది. యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్ మాత్రం ఆప్ గరిష్ఠంగా 53 సీట్లు గెలిచింది. ఇండియా టీవీ-సీ ఓటర్ సర్వే కనీసం 35 సీట్లు గెలుస్తుందని అంచనా వేసింది. అయితే, ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ ఎన్నికల్లో ఆప్ 67 సీట్లలో విజయం సాధించింది. బీజేపీకి కేవలం మూడు స్థానాలకు పరిమితమైంది.

### 2020లో ఇలా..

2020లో జరిగిన ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి 62 స్థానాల్లో గెలుపొందింది. బీజేపీకి ఎనిమిది సీట్లు రాగా, కాంగ్రెస్ ఒక్క స్థానంలోనూ గెలువలేకపోయింది. ఎగ్జిట్ పోల్స్ ప్రభావం మరోసారి ఫలితాల్లో కనిపించింది. ఎనిమిది సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేశాయి. అన్ని ఎగ్జిట్ పోల్స్ లో ఆమ్ ఆద్మీ పార్టీ మెజారిటీ సాధిస్తుందని చెప్పాయి.

ఢిల్లీ ఎగ్జిట్ పోల్స్ ప్రకారం, యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్స్ వాస్తవ ఫలితాలకు కొద్దిగా దగ్గరా వచ్చాయి.

ఆప్ పార్టీ 59-68 సీట్లు గెలుస్తుందని అంచనా వేసింది.

ఈ ఎగ్జిట్ పోల్‌లో బీజేపీకి సగటున 15 సీట్లు వస్తాయని అంచనా వేయగా.. ఆ పార్టీకి కేవలం 8 సీట్లు మాత్రమే వచ్చాయి.

చాలా సర్వే సంస్థలు కాంగ్రెస్ సున్నా నుంచి ఒక సీటు మాత్రమే వస్తాయని చెప్పగా.. కాంగ్రెస్ ఖాతా సైతం తెరువలేకపోయింది.

## రాయదుర్గంలో యువకుడి
# ఆత్మహత్య

### - ప్రేమ వ్యవహారమే కారణం

ఈ-కబురు, శేరిలింగంపల్లి : ప్రియురాలికి, స్నేహితుడికి వీడియో కాల్ చేసిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గతకొన్ని రోజులుగా ప్రియురాలితో ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఇద్దరు మాట్లాడుకోవడం లేదని, ఇదే వేదనతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. రాయదుర్గంలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... ఒరిస్సా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన ధర్మ ప్రదాన్(29) పనికోసం గత పదిహేను రోజుల క్రితం నగరానికి వచ్చి రాయదుర్గంలో నిర్మాణంలో ఉన్న ఆపర్జా కనుస్ట్రక్షన్స్ లో క్రేన్ ఆపరేటర్ గా పనిచేస్తున్నాడు. అపర్ణా కనుస్ట్రక్షన్స్ లోనే ఉన్న లేబర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కాగా ధర్మ ప్రధాన్ ఒడిస్సాలో నివాసం ఉండే ఓ యువతితో గతకొన్నేళ్లుగా ప్రేమలో ఉన్నాడు. వీరు ఇద్దరి మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా గతకొన్ని రోజులుగా ఇద్దరు మాట్లాడుకోవడం లేదు. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన ధర్మ ప్రదాన్ మంగళవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఒడిస్సాలో ఉన్న యువతికి, నార్సింగిలో ఉండే తన స్నేహితుడికి వీడియో కాల్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నాని చెప్పి ఫోన్ కట్ చేశాడు. అనంతరం తాను నివాసం ఉంటున్న గదిలోనే తన చేతిని కత్తితో కోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నార్సింగి లో ఉండే స్నేహితుడు విషయం అపర్ణ నిర్వాహకులకు సమాచారం అందించాడు. దీంతో వారు లేబర్ కాలనీకి వెళ్లగా అప్పటికే ధర్మ ప్రధాన్ తన చేతిని కత్తితో కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్వాహకులు రాయదుర్గం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి చేరుకున్న రాయదుర్గం పోలీసులు మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ధర్మ ప్రధాన్ ఫోన్ ను పరిశీలించిన అనంతరం ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు అంచనాకు వచ్చారు.

# 205 మందిని వెనక్కి పంపిన అమెరికా

### శాన్ ఆంటోనియో నుంచి బయలుదేరిన సైనిక విమానం


### అమెరికాలో చట్టవిరుద్ధంగా 7,25,000 మంది భారతీయులు

**ఈ-కబురు,వాషింగ్టన్**

ఫిబ్రవరి 05 : అక్రమ వలసదారులపై డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అణచివేతను ముమ్మరం చేసింది. 205 మంది భారతీయ వలసదారులతో కూడిన అమెరికా సైనిక విమానం సీ-17 స్థానిక కాలమానం ప్రకారం సోమవారం శాన్ ఆంటోనియో నుంచి భారత్‌కు బయలుదేరింది. విమానం 24 గంటల తరువాత పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు చేరుకుంటుందని, వెనక్కి పంపే ముందు ప్రతి ఒక్కరినీ పరిశీలించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా, ఈ విమానం ఇంధనం కోసం జర్మనీలోని రామ్‌స్టీన్‌లో ఆగనుంది. ఈ పరిణామాలను ధ్రువీకరించడానికి యూఎస్ ఎంబసీ నిరాకరించింది.

### 18వేల మందితో జాబితా..

అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్ఫోర్స్మెంట్ (ఐసీఈ) దాదాపు 18,000 మంది డాక్యుమెంట్లు లేని భారతీయ పౌరుల తొలి జాబితాను రూపొందించింది. టెక్సాస్‌లోని ఎల్‌పాసో, కాలిఫోర్నియాలోని



శాన్‌డియాగో నుంచి 5,000 మందికి పైగా వలసదారులను బహిష్కరించాలని నిర్ణయించినట్లు పెంటగాన్ ప్రకటించింది. ప్యూ రీసెర్చ్ సెంటర్ డేటా ప్రకారం, 725,000 మంది భారతీయులు అక్రమంగా అమెరికాలో నివసిస్తున్నారు, మెక్సికో, ఎల్ సాల్వడార్ తరువాత అనధికారిక వలసదారుల జనాభాలో భారత్ మూడోస్థానంలో ఉంది. డాక్యుమెంట్లు లేని భారతీయులను చట్టబద్ధంగా తమ దేశానికి తిరిగి తీసుకురావడానికి భారత్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని గత నెలలో న్యూఢిల్లీ తెలిపింది.

దీనికి ఏ దేశం మినహాయింపు కాదని, చట్టవిరుద్ధంగా అమెరికాలో ఉన్నవారిలో భారతీయులు ఉంటే చట్టబద్ధంగా స్వదేశానికి తీసుకు రావడానికి మేము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని జైశంకర్ తెలిపారు. చట్టవిరుద్ధంగా అమెరికాకు వచ్చిన భారతీయ వలసదారులను వెనక్కి రప్పించే విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ సరైనదే చేస్తారని అధ్యక్షుడు ట్రంప్ జనవరిలో ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా సైనిక విమానాలు గ్వాటెమాలా, పెరూ, హొండురాస్ దేశాలకు వలసదారులను తరలించాయి. ఇమ్మిగ్రేషన్‌పై తన ఎమర్జెన్సీ డిక్లరేషన్ లో భాగంగా ట్రంప్ గత వారం మిలటరీ బహిష్కరణ విమానాలను ప్రారంభించారు.

ఇప్పటివరకు ఆరు విమానాల్లో వలసదారులను లాటిన్ అమెరికాకు విమానాల్లో పంపారు.

అందులో రెండో సి 17 కార్గో విమానాల ల్యాండింగ్‌కు కొలంబియా నిరాకరించింది. దీంతో నాలుగు మాత్రమే గ్వాటెమాలాలో ల్యాండ్ అయ్యాయి.

# త్వరలో జీఎస్టీ శ్లాబ్‌ల సరళీకరణ



**వస్తు, సేవల పన్ను శ్లాబ్‌లను మరింత సరళీకరించాలని జీఎస్టీ కౌన్సిల్ యోచిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. సరళమైన, క్రమబద్ధమైన పన్నుల వ్యవస్థ లక్ష్యంగా చేసుకుని జీఎస్టీ శ్లాబుల సంఖ్యను తగ్గించడం, రేట్లను హేతుబద్ధీకరించడాన్ని కౌన్సిల్ పరిశీలిస్తోందని మంత్రి హింట్ ఇచ్చారు.**

ప్రస్తుతం జీఎస్టీ వ్యవస్థలో 5%, 12%, 18%, 28% అనే నాలుగు అంచెలు ఉన్నాయి. ప్యాక్ చేసిన ఆహారం వంటి నిత్యావసర వస్తువులపై అత్యల్పంగా 5 శాతం, లగ్జరీ వస్తువులు వంటివాటిపై అత్యధికంగా 28 శాతం పన్ను విధిస్తున్నారు. ఇప్పటికే కొన్ని శాఖలు, వ్యాపార సంఘాల నుంచి ఈ శ్లాబ్‌ల సవరణకు సంబంధించి చాలా ప్రతిపాదనలు వస్తున్నాయి. ఈ శ్లాబ్‌ల సంఖ్యను తగ్గించేలా రానున్న జీఎస్టీ కౌన్సిల్ మీటింగ్‌లో నిర్ణయం తీసుకుంటారని నిపుణులు అంచనా వేస్తున్నారు. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ రేట్లను తగ్గిస్తారని అభిప్రాయపడుతున్నారు.

సామాన్యులపై భారం పడకుండా..

జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించడం, వాటిని సరళతరం చేసే కార్యక్రమాలు దాదాపు మూడేళ్లుగా కొనసాగుతున్నట్లు ఆర్థిక మంత్రి ఉద్ఘాటించారు. జీఎస్టీ రేట్లలో మార్పులు, శ్లాబులను తగ్గించేందుకు మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిత్యావసర వస్తువులపై రేట్ల సవరణ వల్ల సామాన్యులపై భారం పడకుండా పన్ను వ్యవస్థను నిష్పక్షపాతంగా ఉండేలా చూడాల్సిన అవసరాన్ని నిర్మలా సీతారామన్ నొక్కి చెప్పారు. జీఎస్టీ సమీక్ష పరిధిని విస్తృతం చేశామని పేర్కొన్నారు. ప్రతిపాదిత మార్పులపై జీఎస్టీ కౌన్సిల్ త్వరలో నిర్ణయం తీసుకుంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్నికల వేళ నిర్ణయాలపై విమర్శలు

2025-26 కేంద్ర బడ్జెట్‌లో మధ్యతరగతి ప్రజలకు గణనీయమైన ఆదాయపు పన్ను ఉపశమనం లభించింది. దేశ ఆర్థిక మూలాలు బలంగా ఉన్నాయని, నిర్మాణాత్మక ఆర్థిక మందగమనం లేదని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. కొన్ని ప్రాంతాల్లో జరగబోయే ఎన్నికలను ప్రభావితం చేయడమే లక్ష్యంగా పన్ను మినహాయింపు ఉందన్న ఊహాగానాలను ఆమె తోసిపుచ్చారు. జీఎస్టీ శ్లాబుల తగ్గింపుతో నిత్యావసర వస్తువులు, సేవల ధరలు తగ్గడం ద్వారా వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని నిపుణులు భావిస్తున్నారు. పన్ను వ్యవస్థను సరళతరం చేసి మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ విస్తృత లక్ష్యానికి ఇది తోడ్పడుతుంది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలైన బీఎస్‌ఈ సెన్సెక్స్ , ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 50 అస్థిరమైన సెషన్‌ను ప్రతికూలంగా ముగించాయి. వీఎస్‌ఈ సెన్సెక్స్ 312.53 పాయింట్లు లేదా 0.40 శాతం తగ్గి 78,271.28 వద్ద స్థిరపడింది. ఈరోజు ఇండెక్స్ 78,735.41 - 78,226.26 పరిధిలో ట్రేడైంది. సెన్సెక్స్‌ను ప్రతిబింబిస్తూ నిఫ్టీ 50 కూడా 42.95 పాయింట్లు లేదా 0.18 శాతం నష్టపోయి 23,696.30 వద్ద ముగిసింది. ఈ సూచీ ఈరోజు గరిష్ట స్థాయి 23,807.30ని నమోదు చేయగా, కనిష్ట స్థాయి 23,680.45గా ఉంది.



నిఫ్టీ 50 లోని 25 షేర్లు నష్టాల్లో ముగిశాయి. వీటిలో ఏషియన్ పెయింట్స్, టైటాన్ కంపెనీ, నెస్లే ఇండియా, బ్రిటానియా ఇండస్ట్రీస్, టాటా కన్స్యూమర్ టాప్ లూజర్స్‌గా ఉన్నాయి. వీటి నష్టాలు 3.40 శాతం వరకు నమోదయ్యాయి. మరోవైపు ఓఎన్‌జీసీ, హిందాల్కో, అపోలో హాస్పిటల్స్, బీపీసీఎల్ టాప్ గెయినర్స్‌గా 2.90 శాతం వరకు లాభాలను అందుకున్నాయి. ఇక విస్తృత మార్కెట్లు బెంచ్‌మార్క్‌లను అధిగమించాయి. స్మాల్-క్యాప్ షేర్లు ముందంజలో ఉన్నాయి. నిఫ్టీ స్మాల్‌క్యాప్100 ఇండెక్స్ 1.85 శాతం లాభపడింది. నిఫ్టీ మిడ్‌క్యాప్100 ఇండెక్స్ 0.68 శాతం లాభాలతో స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈలో రంగాల సూచీల్లో నిఫ్టీ ఎఫ్‌ఎంసీజీ, రియాల్టీ, ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్ ఇండెక్స్‌లు 1.75 శాతం వరకు నష్టపోయాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, మెటల్, ఓఎంసీలు, మీడియా ఇండెక్స్‌లు ఒక్కొక్కటి 1 శాతానికి పైగా లాభపడ్డాయి.



## 17,600 సంస్థల మూసివేత..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి 26 వరకు 17,654 కంపెనీలు మూతబడ్డాయని, ఇదే వ్యవధిలో 1,38,027 సంస్థలు రిజిస్టర్ అయ్యాయని కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా రాజ్యసభకు రాతపూర్వకంగా తెలిపారు. 2023%-%24లో మూతబడిన సంస్థల సంఖ్య 22,044గాను, 2022%-%23లో 84,801గాను ఉంది. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు పరిమళ్ నథ్వానీ అడిగిన ప్రశ్నకు గాను మంత్రి ఈ సమాధానం ఇచ్చారు.

### ఐదేళ్లలో 339 విదేశీ కంపెనీలు..

2020 నుంచి విదేశీ కంపెనీల రిజిస్ట్రేషన్ తగ్గుతున్నట్లు కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా రాజ్యసభకు తెలిపారు. గత అయిదేళ్లలో 339 విదేశీ కంపెనీలు భారత్‌లో నమోదు చేయించుకున్నట్లు వివరించారు. 2020లో 90 విదేశీ కంపెనీలు రిజిస్టర్ చేసుకోగా ఆ తర్వాత నుంచి ఇది తగ్గుతూ వస్తోంది. 2021లో 75, 2022లో 64, 2023లో 57, 2024లో 53 సంస్థలు నమోదు చేసుకున్నాయి.

### ఉద్దేశపూర్వక డిఫాల్టర్లు 2,664

గతేడాది మార్చి ఆఖరు నాటికి వ్యక్తులు, విదేశీ రుణగ్రహీతలు మినహా ఉద్దేశపూర్వకంగా రుణాలు ఎగవేసిన డిఫాల్టర్ల సంఖ్య 2,664గా ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి రాజ్యసభకు తెలిపారు. విల్‌ఫుల్ డిఫాల్టర్లు క్రమంగా తగ్గుతున్నారని వివరించారు. 2021%-%22లో 160 డిఫాల్టర్లు పెరగ్గా 2023%-%24లో ఇది 42కి తగ్గినట్లు వివరించారు. ఉద్దేశపూర్వక ఎగవేతలను నిరోధించేందుకు, మొండిబాకీలను తగ్గించేందుకు ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి పేర్కొన్నారు.



# అక్రమ జామర్స్‌తోనే కాల్ డ్రాప్స్

**విద్యా సంస్థలు, గృహాలు, కంపెనీల్లో ఏర్పాటు చేసిన అక్రమ జామర్స్, రిపీటర్స్‌తో మొబైల్ నెట్‌వర్క్ సేవల నాణ్యత క్షీణిస్తోందని టెలికం కంపెనీలకు ప్రాతినిథ్యం వహిస్తున్న సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాప్రభుత్వానికి నివేదించింది. వాటి కారణంగానే వినియోగదారులకు కాల్ డ్రాప్స్, డేటా వేగం తగ్గుతోందని తెలిపింది. అక్రమంగా జామర్స్, రిపీటర్స్‌ను వినియోగిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొంది.**

రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా తదితర సంస్థలు సీవోఏఐలో సభ్యులుగా ఉన్నాయి. కాల్ డ్రాప్స్‌కు వాటే జామర్స్‌ను ఉపయోగించడం టెలికమ్యూనికేషన్స్ చట్టం 2023 ప్రకారం నేరమని, వాటి వినియోగాన్ని నిలిపివేయాల్సిందిగా సీవోఏఐ కోరింది. ఈ మేరకు రాష్ట్రాలకు లేఖలు రాయాల్సిందిగా టెలికం శాఖను అభ్యర్థించింది. ఈ పరికరాలను అమెజాన్ ఇండియా విక్రయిస్తోందని తెలిపింది. టెలికమ్యూనికేషన్‌ను నిరోధించే ఏదైనా పరికరాలను అక్రమంగా కలిగి ఉంటే మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ.50 లక్షల వరకు జరిమానా లేదా రెండూ విధిస్తారని సీవోఏఐ వివరించింది.

### తయారీ స్టార్టప్‌లపై ఫండ్ ఆఫ్ ఫండ్స్ దృష్టి

అంకుర సంస్థల కోసం కొత్తగా ప్రకటించిన రూ.10,000 కోట్ల ఫండ్ ఆఫ్ ఫండ్స్ స్కీమ్ (ఎఫ్‌ఎఫ్‌ఎస్) ప్రధానంగా తయారీ, హై%-%టెక్నాలజీ రంగాలకు చెందిన స్టార్టప్‌లపై దృష్టి పెట్టనున్నట్లు పరిశ్రమలు, అంతర్గాత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా తెలిపారు. రెండో విడత ఎఫ్‌ఎఫ్‌ఎస్ కోసం ప్రత్యామ్నాయ పెట్టుబడి ఫండ్‌లు (ఏఐఎఫ్), సిడ్బీ మొదలైన వాటితో సంప్రదింపులు జరిపినట్లు ఆయన పేర్కొన్నారు.

2016లో రూ.10,000 కోట్లతో ప్రకటించిన తొలి విడత ఎఫ్‌ఎఫ్‌ఎస్, అంకురాల పెట్టుబడుల అవసరాలను తీర్చే ఏఐఎఫ్ వ్యవస్థ రూపుదిద్దుకోవడానికి ఉపయోగపడినట్లు వివరించారు. దీని కింద 1,180 స్టార్టప్‌లకు ఏఐఎఫ్‌ల ద్వారా రూ.21,700 కోట్ల మేర పెట్టుబడులు సమకూరినట్లు పేర్కొన్నారు. తొలి విడత ఎఫ్‌ఎఫ్‌ఎస్ కాలపరిమితి 10 ఏళ్లుగా ఉండగా, హై%-%టెక్నాలజీ అంకురాల దీర్ఘకాలిక నిధుల అవసరాలను తీర్చే విధంగా కొత్త స్కీము కాలపరిమితిని 14%-%15 సంవత్సరాలుగా నిర్ణయించవచ్చని భాటియా వివరించారు. డెట్ ఫండ్స్‌ను ప్రవేశపెట్టే అంశంపై కూడా చర్చలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

# ఐపీవోకు 7 కంపెనీలు రెడీ

## సెబీ నుంచి తాజాగా అనుమతులు




న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా 7 కంపెనీల పబ్లిక్ ఇష్యూలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ జాబితాలో డిఫెన్స్ తయారీ కంపెనీ ఏఎంపీపీసహా.. ఆదిత్య ఇన్ఫోటెక్, బ్రిగేడ్ హొటల్, కుమార్ ఆర్క్ టెక్, సోలార్ వరల్డ్ ఎనర్జీ సొల్యూషన్స్, ఇండోగల్ఫ్ క్రాప్ సైన్సెస్, గ్లోబ్ సివిల్ ప్రాజెక్ట్స్, ప్రోస్టార్ ఇన్ఫోసిస్టమ్స్ చేరాయి. అయితే ఆటో విడిభాగాల సంస్థ వినే కార్పొరేషన్ ముసాయిదా పేపర్స్‌ను ఇటీవలే వెనక్కి తీసుకుంది. మర్చంట్ బ్యాంకర్ల వివరాల ప్రకారం ఇవన్నీ ఉమ్మడిగా రూ. 7,800 కోట్లు సమీకరించనున్నాయి.

### రూ. 4,000 కోట్లపై కన్ను

ఐపీవో ద్వారా ఎస్ఎంపీపీ లిమిటెడ్ రూ. 4,000 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. దీనిలో భాగంగా రూ. 580 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుండగా.. మరో రూ. 3,420 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ శివ్ చంద్ కన్సల్ విక్రయానికి ఉంచనున్నారు. ప్రస్తుతం ప్రమోటర్‌గా కన్సల్ 50 శాతం వాటాను కలిగి ఉన్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 437 కోట్లు అనుబంధ కంపెనీ ద్వారా పెట్టుబడి వ్యయాలపై వెచ్చించనుంది.

### రూ. 1,300 కోట్ల సమీకరణ

ఆదిత్య ఇన్ఫోటెక్ ఐపీవో ద్వారా రూ. 1,300 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. దీనిలో భాగంగా రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుండగా.. మరో రూ. 800 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ నిధుల్లో రూ. 375 కోట్లు రుణాల చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

### రూ. 900 కోట్లకు సై

ఆతిథ్య రంగ కంపెనీ బ్రిగేడ్ హొటల్ వెంచర్స్ ఐపీవోలో భాగంగా రూ. 900 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. తద్వారా పెట్టుబడులను సమీకరించాలని ఆశిస్తోంది. వీటిలో రూ. 481 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 59 కోట్లు మెటీరియల్ అనుబంధ సంస్థ ఎస్ఆర్‌పీ ప్రోస్పరిటా హొటల్ వెంచర్స్‌కు కేటాయించనుంది. మరో రూ. 108 కోట్లు భూమి కొనుగోలుకి వెచ్చించనుంది.

### రూ. 740 కోట్లపై దృష్టి

పీవీసీ బ్లెండ్ ఆధారిత బిల్డింగ్ మెటీరియల్ తయారీ కంపెనీ కుమార్ ఆర్క్ టెక్ ఐపీవో ద్వారా రూ. 740 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. రూ. 500 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనుండగా.. మరో రూ. 240 కోట్ల విలువైన ఈక్విటీని కంపెనీ తాజాగా జారీ చేయనుంది. ఈ నిధుల్లో రూ. 182 కోట్లు అనుబంధ సంస్థ టేలియస్ ఇండస్ట్రీలో పెట్టుబడికి వెచ్చించనుంది.

### రూ. 600 కోట్లకు రెడీ

సోలార్‌వరల్డ్ ఎనర్జీ సొల్యూషన్స్ ఐపీవోలో భాగంగా రూ. 600 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది. దీనిలో రూ. 550 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. మరో రూ. 50 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు.

### రూ. 200 కోట్లతోపాటు..

ఐపీవోలో భాగంగా ఇండోగల్ఫ్ క్రాప్‌సైన్సెస్ రూ. 200 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 38.55 లక్షల షేర్లను ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు.

### 1.9 కోట్ల షేర్ల జారీ

గ్లోబ్ సివిల్ ప్రాజెక్ట్స్ ఐపీవోలో భాగంగా 1.9 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. నిధులను పరికరాల కొనుగోలు, వర్కింగ్ క్యాపిటల్, సాధరణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.

# .. అయినా భార్య కంటే తక్కువే!

సినిమా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వడం అంత ఈజీ కాదు. చాన్స్‌ల కోసం ఏళ్లుగా ఎదురుచూసే వాళ్లు చాలానే ఉంటారు. బ్యాగ్రౌండ్ ఉన్నవాళ్లకి మాత్రం ఫస్ట్ చాన్స్ ఈజీగా వచ్చేస్తుంది. కానీ వచ్చిన అవకాశం వినియోగించుకోకుంటే..వాళ్లను కూడా పట్టించుకోరు. వారసత్వంగా వచ్చి.. వెనక్కి వెళ్లిన నటులు చాలా మందే ఉన్నారు.



మరికొంతమందికి మాత్రం ఎన్ని ఫ్లాపులు వచ్చిన అవకాశాలు వస్తునే ఉంటాయి. వరుస సినిమాలు తీస్తూ కోట్ల ఆస్తులను కూడబెడుతుంటారు. అలాంటి వారిలో అభిషేక్ బచ్చన్ ఒక్కరు. ఆయన సినీ కెరీర్‌లో అత్యధిక ఫ్లాపులే ఉంటాయి. కానీ ఆస్తుల విషయంలో మాత్రం స్టార్ హీరోలకు ఏ మాత్రం తగ్గలేదు. నేడు(ఫిబ్రవరి 5) అభిషేక్ బచ్చన్ బర్త్‌డే. ఈ సందర్భంగా ఆయన ఆస్తులపై ఓ లుక్కేద్దాం.

**విశాలవంతమైన విల్లాలు**

అభిషేక్ మొత్తం ఆస్తుల విలువ దాదాపు రూ. 280 కోట్లకు పైగా ఉంటుందట. ఇందులో ఎక్కువగా సొంతంగా సంపాదించుకున్నదే అట. తండ్రి వారసత్వంగా వచ్చే ఆస్తులు కలిపిస్తే..ఇది ఇంకా ఎక్కువగానే ఉంటుంది. సినిమాలపై వస్తే డబ్బును ఎక్కువగా ముంబైలోని బాంద్రా ప్రాంతంలో పెట్టుబడిగా పెట్టాడట. అలాగే దుబాయ్‌లో ఓ విలాసవంతమైన విల్లా కొనుగోలు చేశాడు. అభిషేక్ దుబాయ్ వెళ్ళినప్పుడు ఇక్కడే ఉంటాడు. దీని ధర 16 కోట్ల రూపాయలు. 'బాంద్రా-కుర్లా' కాంప్లెక్స్, 5 %దీ఼ఖ% అపార్ట్‌మెంట్‌తో సహా అనేక ప్రదేశాలలో పెట్టుబడులు పెట్టారు. ఈ హీరోకి క్రీడలంటే ప్రత్యేక ఆసక్తి. అందుకే జైపూర్ పింక్ పార్టనర్స్ (ప్రో కబడ్డీ), చెన్నైయిన్ %ఖీజ% (ఫుట్‌బాల్) పెట్టుబడి పెట్టారు.

**లగ్జరీ కార్లు**

అభిషేక్ దగ్గర రోల్స్ రాయిస్ ఫాంటమ్, బెంట్లీ కాంటినెంటల్ జీటీ(3.29 కోట్లు), ఆడి ఏ8ఎల్, మెర్సిడెస్-బెంజ్, ల్యాండ్ రోవర్ డిఫెండర్ 130%శ% లాంటి ఖరీదైన కార్లు ఉన్నాయి. అలాగే రియల్ ఎస్టేట్‌పై కూడా భారీగా డబ్బు పెట్టాడల. ముంబైలో పలు చోట్ల ఓపెన్ ఫ్లాట్లు కూడా కొనుగోలు చేశారట. మొత్తంగా అభిషేక్ ఆస్తులు 280 కోట్లకు పైనే ఉంటుందట. అయితే భార్య ఐశ్వర్య రాయ్‌తో పోలిస్తే మాత్రం అభిషేక్ ఆస్తులు విలువ చాలా తక్కువేనట. ఐశ్వర్య మొత్తం ఆస్తుల విలువ రూ.776 కోట్ల వరకు ఉంటుందట.

**నటనకు ప్రశంసలు కానీ..**

బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ వారసుడిగా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన అభిషేక్.. కెరీర్‌లో ఎక్కువగా ఫ్లాపులనే చవి చూశడు. ఆయన తొలి సినిమా రెఫ్యూజీ బాక్సాఫీస్ వద్ద యావరేజ్ టాక్ సంపాదించుకుంది. అయితే నటన పరంగా మాత్రం అభిషేక్‌కు మంచి మార్కులే పడ్డాయి. ఆ తర్వాత అభిషేక్ నటించిన 8 సినిమాలు వరుసగా ఫ్లాపులు అయ్యాయి. అయినా కూడా అభిషేక్‌ని చాన్స్‌లు వచ్చాయి. ధూమ్ సినిమాతో అభిషేక్‌కి తొలి బ్లాక్ బస్టర్ దక్కింది. బంటీ ఔర్ బబ్లీ మూవీతో సోలో హీరోగా హిట్ కొట్టాడు. ఆ తర్వాత మళ్లీ ఫ్యాపులు వచ్చాయి. ధూమ్ 3, హ్యాపీ న్యూ ఇయర్, ఐ వాంట్ టు టాక్ వంటి సినిమాలు ఆయనకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. ప్రస్తుతం ఆయన గులాబ్ జామున్, డ్యాన్సింగ్ డాడ్‌తో పాటు ధూమ్ 4 చిత్రాల్లో నటిస్తున్నాడు.



## నా కోసం కథలు రాయడం ఆనందంగా ఉంది: తిరువీర్

జార్జ్ రెడ్డి, పలాస 1978 వంటి చిత్రాలలో తన దైన నటనతో ప్రేక్షకుల హృదయాల్లో మంచి స్థానాన్ని సంపాదించుకున్నారు తిరువీర్. ఆ తరువాత మసూద, పరేషన్ వంటి చిత్రాలలో ప్రధాన పాత్రలో ప్రేక్షకులను మరింతగా మెప్పించారు. ఇక తిరువీర్ కెరీర్‌లో మసూద బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ప్రస్తుతం తిరువీర్ పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం తిరువీర్ 'ది గ్రేట్ ప్రీ-వెడ్డింగ్ షో' అనే చిత్రంలో ఫోటోగ్రాఫర్ పాత్రలో కనిపించనున్నారు. రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్టైనర్‌గా ఉండబోతోంది.

తిరువీర్ తన కొత్త చిత్రం గురించి మాట్లాడుతూ.. "వెడ్డింగ్ ఫోటోగ్రాఫర్ పాత్రను పోషించడం చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. మొబైల్‌తో చాలాసార్లు ఫోటోలు తీశాను. కానీ ఇలా ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్‌గా నటించడం చాలా కొత్తగా, ఛాలెంజింగ్‌గా అనిపిస్తోంది. స్టిల్స్ ఎలా పెట్టించాలి, కెమెరాను ఎలా పట్టుకోవాలి ఇలా చాలా విషయాల్ని నేర్చుకున్నాను. అందరినీ ఎంటర్టైన్ చేసేలా ఈ చిత్రం ఉంటుంద'ని అన్నారు.

రీసెంట్‌గా ఈ మూవీ షూటింగ్ అరకులో జరిగింది. అక్కడి చలి తీవ్రతను తట్టుకుని మరి టీం అంతా ఎంతో కష్టపడి సినిమాను షూట్ చేశారు. ఈ సినిమాతో పాటుగా తిరువీర్ 'భగవంతుడు' అనే మరో ప్రాజెక్ట్‌ని కూడా చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండు చిత్రాలకు సంబంధించిన షూటింగ్‌తో తిరువీర్ ప్రస్తుతం బిజీగా ఉన్నారు.

తిరువీర్ తన కొత్త సినిమాల గురించి మాట్లాడుతూ..'మసూద తర్వాత చాలా సెలెక్టివ్‌గా సినిమాల్ని, కథల్ని ఎంచుకుంటున్నాను. నాకు సరిపోయే కథల్ని మాత్రమే సెలెక్ట్ చేసుకుంటున్నాను. నేను స్టేజ్ ఆర్టిస్ట్‌ని కావడంతో ఆయా పాత్రలకు న్యాయం చేయగలుగుతున్నాను. దర్శకనిర్మాతలు నా కోసం పాత్రలు, కథలు రాస్తుండటం ఆనందంగా ఉంది. ఇదే ఓ నటుడికి గొప్ప విజయం' అని అన్నారు.

ఆరుపాటలూ లవ్ సాంగ్స్ ఉండే ఓ ప్రేమకథ చేయాలనే కోరిక బన్నీకి (అల్లు అర్జున్) ఎప్పట్నుంచో ఉంది. 'గుర్తుపెట్టుకో.. మనం అలాంటి సినిమా చేద్దాం' అంటూ మొన్న ఓ పేపర్ మీద రాసిచ్చారు (నవ్వుతూ). 'తండేల్' మూవీ మ్యూజిక్‌కి దేవిని ఫిక్స్ అయిపోమని అరవింద్ అంకుల్‌తో బన్నీ ముందే చెప్పారు.

## అవే నాకు వెయ్యి ఏనుగుల బలం ఇస్తాయి: దేవిశ్రీ ప్రసాద్

"చాలా రోజుల తర్వాత వస్తున్న అందమైన ప్రేమకథా చిత్రం 'తండేల్'. ఈ సినిమాలోని 'బుజ్జి తల్లి...' పాట విన్న సుకుమార్‌గారు.. 'నీ ఆల్ టైమ్ టాప్ ఫైవ్‌లో ఉంటుంది' అన్నారు. ఆ సాంగ్ రిలీజైన వెంటనే ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. అలాగే శివుని పాట, హైలెస్సో... పాటలు గొప్పగా జనాల్లోకి వెళ్లాయి. ఈ సినిమాలోని పాటలన్నీ పెద్ద హిట్ అవడం సంతోషంగా ఉంది" అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. అక్కినేని నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వం వహించిన చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ విలేకరులతో పంచుకున్న విశేషాలు.



- నా కెరీర్ ఆరంభంలో నేను చేసిన 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా, వర్షం, ఆర్య, 100% లవ్' వంటి ప్రేమకథలతో పాటు 'శంకర్‌దాదా ఎంబీబీఎస్, మాస్' లాంటి కమర్షియల్ సినిమాలకు కూడా మ్యూజిక్ పరంగా ప్రేక్షకుల నుంచి అంతే అద్భుతమైన స్పందన వచ్చింది. ఎలాంటి సినిమా అయినా చేయగలననే పేరు రావడం, అందులోనూ ప్రేమకథలకి మంచి సంగీతం ఇస్తానని అందరూ అనుకోవడం దేవుడి ఆశీస్సులుగా భావిస్తాను
- 'తండేల్' స్వచ్ఛమైన ప్రేమకథ. వాస్తవ ఘటనల ఆధారంగా రాసుకున్న కథ. చందు మొండేటి గ్రేట్ విజన్‌తో ఈ సినిమా తీశాడు. చైతన్యగారు ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. కొత్త నాగచైతన్యని చూడబోతున్నారు. సాయిపల్లవి నటన కూడా ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది
- యంగ్ ఏజ్‌లో మ్యూజిక్ డైరెక్టర్‌గా కెరీర్ స్టార్ట్ చేశా. నేనే నా మ్యూజిక్ వింటూ పెరిగాను (నవ్వుతూ). అన్ని జానర్ సినిమాలు చేసే అవకాశం రావడం, అన్ని వయసుల వారికి నచ్చే మ్యూజిక్ ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నాను. లైవ్ షోస్ చేయడం నాకు వెయ్యి ఏనుగుల బలం ఇస్తుంది. ప్రేక్షకులు అభిమానం, ఆదరణ నాకు గొప్ప ఎనర్జీతో పాటు ఇంకా గొప్ప మ్యూజిక్ చేయాలనే స్ఫూర్తినిస్తాయి. ప్రస్తుతం 'కుబేర' సినిమాకి సంగీతం అందిస్తున్నాను.

## చిన్న చిత్రాలు పెద్ద సౌండ్ చేస్తున్నాయి -రాజ్ కందుకూరి



గాయత్రీ గుప్తా, గణేశ్ రెడ్డి, పూజా కేంద్రే, సాయి సతీష్ ప్రధాన పాత్రల్లో నటించిన హారర్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'భవానీ వార్డ్ 1997'. జీడీ నరసింహా దర్శకత్వంలో జీడీఆర్ మోషన్ పిక్చర్, విభూ మీడియా సమర్పణలో చంద్రకాంత సోలంకి, జీడీ నరసింహా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన నిర్మాత రాజ్ కందుకూరిమాట్లాడుతూ%-% "ఇప్పుడు కంటెంట్ ఉన్న సినిమాలే ఆడుతున్నాయి. చిన్న చిత్రాలే పెద్ద సౌండ్ చేస్తున్నాయి. ఈ చిత్రంలో కంటెంట్ ఉందని నమ్ముతున్నాను. ఈ మూవీ పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను" అన్నారు. "హారర్ చిత్రాలను ఇష్టపడేవారికి ఈ మూవీ నచ్చుతుంది" అని పేర్కొన్నారు జీడీ నరసింహా. "ఈ మూవీలో ప్రతి సీన్‌కి ప్రాధాన్యం ఉంటుంది" అని తెలిపారు పూజా కేంద్రే. 'ఇంత మంచి పాత్రను నాకు ఇచ్చిన మా దర్శకుడు జీడీ నరసింహకు థాంక్స్. ట్రైలర్ అందరికీ నచ్చింది. సినిమా కూడా అందరికీ నచ్చుతుంది. ఫిబ్రవరి 7న మా చిత్రం రాబోతోంది. అందరూ చూడండి' అని సాయి సతీష్ అన్నారు.



## హిమాలయాల్లో రెస్టారెంట్

బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ హిమాలయాల్లో ఒక రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ది మౌంటెన్ స్టోరీ పేరుతో ఆమె కేఫ్, రెస్టారెంట్ వ్యాపారంలోకి అడుగుపెట్టారు. ఫిబ్రవరి 14న హిమాచల్ ప్రదేశ్‌లో ఎంతో పాపులర్ అయిన వంటకాలతో తన రెస్టారెంట్ ప్రారంభం అవుతుందని ఆమె ప్రకటించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక వీడియోతో పంచుకున్నారు. రెస్టారెంట్ ప్రారంభించడం అనేది తన చిన్ననాటి కల అని కంగనా తెలిపారు. తన అమ్మగారి వంటగదిలో ఉన్నప్పుడే అందుకు తొలి బీజం పడిందని గుర్తుచేసుకున్నారు. ఆధునిక టచ్‌తో పాటుగా సాంప్రదాయ హిమాచల్ ఫుడ్‌ను అందించాలని తాను అనుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇది మీతో నాకున్న రిలేషన్ షిప్ స్టోరీగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. రెస్టారెంట్ వీడియోను కూడా షేర్ చేయడంతో అందులోని ఇంటీరియర్ డిజైన్ గురించి అందరూ మెచ్చుకుంటున్నారు. స్థానిక హిమాచలీ కళాఖండాలతో పాటు సుందరమైన పర్వత దృశ్యంతో బహిరంగ సీటింగ్ వంటి సదుపాయాలు ఉన్నాయని తెలుస్తోంది. పుట్టిన ఊరు మనాలీలో కేఫ్ అండ్ రెస్టారెంట్ ప్రారంభించిన కంగనా తన ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని ఇలా తెలిపారు. 'పర్వతాలు నా ఎముకలు, నదులు నా సిరలు, అడవులు నా ఆలోచనలు, నక్షత్రాలు నా కలలు" అని రాస్తూ.. ఇన్‌స్టాగ్రామ్‌లో రెస్టారెంట్ చిత్రాలను కూడా ఆమె పంచుకున్నారు. చుట్టూ పర్వాతల మధ్యలో మంచు పడుతున్న వేళలో అక్కడి ఫుడ్ ఆస్వాదిస్తూ ఉంటే ఆ సంతోషానికి హద్దులు ఉండవని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. త్వరలో తప్పకుండా అక్కడికి వచ్చి రెస్టారెంట్‌లోని అన్ని వంటకాలను రుచి చూస్తామని, కంగనాకు శుభాకాంక్షలు చెబుతున్నారు.

# విధ్వంసకర శతకం..

## రెండో స్థానానికి దూసుకొచ్చిన అభిషేక్ శర్మ

ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 ర్యాంకింగ్స్‌లో టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ దుమ్మురేపాడు. ఇంగ్లండ్‌తో జరిగిన చివరి టీ20లో విధ్వంసకర శతకంతో (54 బంతుల్లో 135బీ 7 ఫోర్లు, 13 సిక్సర్లు) విరుచుకుపడిన శర్మ.. ఒక్కసారిగా 38 స్థానాలు మెరుగుపర్చుకుని 40వ స్థానం నుంచి రెండో స్థానానికి దూసుకొచ్చాడు.

ప్రస్తుతం శర్మ కెరీర్‌లో అత్యుత్తమంగా 829 రేటింగ్ పాయింట్లు సాధించాడు. శర్మ దెబ్బకు సహచరుడు తిలక్ వర్మ మూడో స్థానానికి పడిపోయాడు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో దారుణంగా విఫలమైన టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఓ స్థానం కోల్పోయి ఐదో స్థానానికి దిగజారాడు. ఆసీస్ విధ్వంసకర వీరుడు ట్రవిస్ హెడ్ టాప్ ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. అభిషేక్ శర్మ దెబ్బకు టాప్-10 (హెడ్ మినహా) బ్యాటర్లు తలో స్థానం కోల్పోయారు.




ఇంగ్లండ్‌తో జరిగిన చివరి రెండు టీ20ల్లో సత్తా చాటిన శివమ్ దూబే 38 స్థానాలు ఎగబాకి 58వ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో పర్వాలేదనిపించిన హార్దిక్ పాండ్యా 5 స్థానాలు మెరుగుపర్చుకుని 51వ స్థానానికి చేరాడు. బ్యాటింగ్ విభాగంలో భారత్ తరఫున ఇవే చెప్పుకోదగ్గ మార్పులు.

బౌలింగ్ విషయానికొస్తే.. ఇంగ్లండ్‌తో చివరి టీ20లో రెండు వికెట్లతో సత్తా చాటిన వరుణ్ చక్రవర్తి మూడు స్థానాలు మెరుగుపర్చుకుని ఆదిల్ రషీద్‌తో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. భారత్ తరఫున టాప్-5లో ఉన్న ఏకైక బౌలర్ వరుణ్ ఒక్కడే. తాజా ర్యాంకింగ్స్‌లో విండీస్ స్పిన్నర్ అకీల్ హొసేన్ తిరిగి అగ్రస్థానాన్ని చేజిక్కించుకోగా.. హసరంగ, ఆడమ్ జంపా తలో స్థానం దిగజారి నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు.

ఇంగ్లండ్‌తో చివరి టీ20లో ఓ మోస్తరుగా రాణించిన భారత స్పిన్నర్ రవి బిష్ణోయ్ నాలుగు స్థానాలు ఎగబాకి ఆరో స్థానానికి చేరాడు. టీ20ల్లో భారత లీడింగ్ వికెట్ టేకర్ అర్షదీప్ 8 నుంచి తొమ్మిదో స్థానానికి పడిపోయాడు. ఇవి మినహా బౌలర్ల విభాగంలో చెప్పుకోదగ్గ మార్పులేమీ లేవు. ఆల్‌రౌండర్ల విషయానికొస్తే.. టీమిండియా మాజీ వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా టాప్ ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. జట్ల ర్యాంకింగ్స్‌లో భారత్ ఏ జట్టుకు అందనంత ఎత్తుకు వెళ్లిపోయింది. 19561 పాయింట్లతో టీమిండియా టాప్‌లో కొనసాగుతుంది. రెండో స్థానంలో ఉన్న ఆస్ట్రేలియా 12417 పాయింట్లు మాత్రమే కలిగి ఉంది.



# 'మా జట్టు ఆసీస్‌లా మారాలి'

## భారత అండర్-19 మహిళల హెడ్ కోచ్ నూషీన్ ఆకాంక్ష

### వరుసగా రెండోసారి టి20 ప్రపంచకప్ టైటిల్ గెలవడంపై సంతోషం

అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో ఆస్ట్రేలియా తరహాలో ఎదురులేని జట్టులా భారత బృందం మారాలన్నదే తమ ఆకాంక్ష అని, అందుకు అనుగుణంగా లక్ష్యాలను నిర్దేశించుకుంటామని భారత మహిళల అండర్%-%19 టీమ్ హెడ్ కోచ్ నూషీన్ అల్ ఖదీర్ వ్యాఖ్యానించింది. మలేసియాలో విశ్వవిజేతలుగా నిలిచిన అనంతరం జట్టు సభ్యులు గొంగడి త్రిష, కేసరి ధృతి, ట్రెయినర్ షాలినిలతో కలిసి నూషీన్ మంగళవారం నగరానికి చేరుకుంది.

రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికా గడ్డపై భారత మహిళలు అండర్%-%19 వరల్డ్ కప్ గెలిచినప్పుడు కూడా ఆమెనే హెడ్ కోచ్‌గా ఉంది. ఆఫ్ స్పిన్నర్‌గా భారత్ తరఫున 85 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 115 వికెట్లు తీసిన నూషీన్ ఖాతాలో ఇప్పుడు కోచ్ హోదాలో వరుసగా రెండు వరల్డ్ కప్ టైటిల్స్ చేరాయి. 'మా అమ్మాయిల నుంచి అత్యుత్తమ ప్రదర్శన వచ్చింది. ఇదంతా సమష్టిగా సాధించిన విజయం.

దాదాపు ఎనిమిది నెలల క్రితమే ఈ టోర్నీ కోసం ప్రణాళికలు రూపొందించి ఎంతో కష్టపడ్డాం. దాని ఫలితమే ఇప్పుడు కనిపించింది. మా విజయంలో టీమ్ సహాయక సిబ్బంది పాత్ర కూడా ఎంతో ఉంది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లు మాత్రమే కాకుండా ట్రెయినర్, ఫిజియో కూడా ఎంతో శ్రమించారు' అని నూషీన్ పేర్కొంది.

తమకు అందించిన బాధ్యతలకు అనుగుణంగా అమ్మాయిలు స్పందించిన తీరును హెడ్ కోచ్ ప్రశంసించింది. 'పరిస్థితులను బట్టి తమను తాము మార్చుకునే విషయంలో మా అమ్మాయిలు సరైన రీతిలో స్పందించారు. డిమాండ్ ప్రకారం తమ ఆటను మార్చుకున్నారు. చాలా కాలంగా కలిసి ఆడుతుండటం వల్ల ప్లేయర్లందరి మధ్య మంచి బంధం ఏర్పడింది.

పైగా తమకు అందించిన బాధ్యతలపై ప్రతీ ప్లేయర్‌కు స్పష్టత ఉండటం కూడా ఎంతో మేలు చేసింది. అందుకే వరల్డ్ కప్‌లో కీలక క్షణాల్లో ఒత్తిడిని అధిగమించి అంత గొప్పగా ఆడగలిగాం' అని కోచ్ వెల్లడించింది. రెండేళ్ల క్రితం సాధించిన విజయం కూడా ఎంతో ఆనందాన్నిచ్చిందని... అయితే దాంతో పోలిస్తే ఈ టైటిల్ మరింత ప్రత్యేకమని నూషీన్ పేర్కొంది. '2023లో సాధించిన విజయంతో పోలిస్తే ఈసారి మేం మరింత నిలకడగా, దూకుడుగా, సంపూర్ణ ఆధిపత్యంతో ఆడాం. మానసికంగా కూడా అమ్మాయిలు ఈసారి దృఢంగా ఉన్నారు.

అందుకే ఈ గెలుపుపై మాకు ముందునుంచే అంచనాలు ఉన్నాయి. సెమీస్‌లో ఇంగ్లండ్ రూపంలో మాకు పెద్ద సవాల్ ఎదురైంది. ఇతర జట్లతో పోలిస్తే ఇంగ్లండ్ గట్టి ప్రత్యర్థి. కానీ అక్కడా మనోళ్లు జోరు కొనసాగించడం జట్టు బలాన్ని చూపించింది. మహిళల క్రికెట్‌లో వన్డేలు, టి20లు కలిపి ఆస్ట్రేలియా 13 వరల్డ్ కప్‌లు గెలిచింది. మా జట్టు కూడా ఆ స్థాయికి చేరుకోవాలని, అంతే బలంగా మారాలని కోరుకుంటున్నాం. మా తర్వాతి లక్ష్యం కూడా అదే' అని ఈ మాజీ స్పిన్నర్ సగర్వంగా చెప్పింది.

'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచిన తెలంగాణ అమ్మాయి త్రిషను కోచ్ ప్రత్యేకంగా అభినందించింది. 'త్రిష అనుభవాన్ని బట్టి ఆమెను ఓపెనర్‌గా పంపాలని వరల్డ్ కప్‌నకు ముందే నిర్ణయించాం. నిజాయితీగా చెప్పాలంటే ఆమె దూకుడైన బ్యాటింగ్ శైలి మమ్మల్నీ ఆశ్చర్యపర్చింది. త్రిష తన షాట్లను మెరుగుపర్చుకోవడంలో ఎంతో కష్టపడింది' అని నూషీన్ అభిప్రాయపడింది.

# ఐసీసీ టోర్నీ తర్వాత రోహిత్ గుడ్‌బై? కోహ్లికి బీసీసీఐ గ్రీన్‌సిగ్నల్!

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మఅంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికే సమయం సమీపిస్తోందా?.. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ముగిసిన తర్వాత అతడు రిటైర్మెంట్ ప్రకటించనున్నాడా? అంటే అవుననే సమాధానమే ఎక్కువగా వినిపిస్తోంది. కాగా టీ20 ప్రపంచకప్-2024 లో భారత్‌ను చాంపియన్‌గా హిట్‌మ్యాన్ అంతర్జాతీయ పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే.




ప్రస్తుతం వన్డే, టెస్టుల్లో కొనసాగుతున్న రోహిత్ శర్మ మునుపటిలా దూకుడు ప్రదర్శించలేకపోతున్నాడు. గతేడాది శ్రీలంకతో వన్డే సిరీస్‌లో మూడు మ్యాచ్‌లలో అతడు చేసిన పరుగులు 58, 64, 35. వైట్‌బాల్ క్రికెట్‌లో ఈ మేర ఫర్వాలేదనిపించినా.. టెస్టు ఫార్మాట్లో మాత్రం దారుణ ప్రదర్శన కనబరిచాడు.

### కెప్టెన్‌గానూ చెత్త రికార్డు

తొలుత సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో తేలిపోయిన రోహిత్ శర్మ.. కెప్టెన్‌గానూ చెత్త రికార్డు మూటగట్టుకున్నాడు. అతడి సారథ్యంలో భారత్ కివీస్ చేతిలో 3-0తో వైట్‌వాష్‌కు గురైంది. తద్వారా స్వదేశంలో ప్రత్యర్థి చేతిలో ఇంతటి పరాభవం చవిచూసిన తొలి భారత కెప్టెన్‌గా హిట్‌మ్యాన్ నిలిచాడు. అనంతరం ఆస్ట్రేలియాతో బోర్డర్-గావస్కర్ ట్రోఫీలోనూ రోహిత్ శర్మ వైఫల్యం కొనసాగింది. వ్యక్తిగత కారణాల వల్ల తొలి టెస్టుకు దూరమైన అతడు.. ఫామ్‌లేమి కారణంగా ఆఖరిదైన సిడ్నీ టెస్టు నుంచి స్వయంగా తప్పుకొన్నాడు. ఇక ఈ ఐదు టెస్టుల సిరీస్‌లో టీమిండియా 3-1తో ఓడిపోయింది.

### రోహిత్ శర్మకు డెడ్‌లైన్

ఈ క్రమంలో 37 ఏళ్ల రోహిత్ శర్మ రిటైర్మెంట్‌పై పెద్ద ఎత్తున ఊహాగానాలు వచ్చాయి. అయితే, ఇప్పట్లో తాను రిటైర్ కాబోనని ఈ కుడిచేతి వాటం బ్యాటర్ స్పష్టం చేశాడు. అయితే, తాజా సమాచారం ప్రకారం.. భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) రోహిత్ శర్మకు డెడ్‌లైన్ విధించినట్లు తెలుస్తోంది. చాంపియన్స్ ట్రోఫీ తర్వాత అతడి అంతర్జాతీయ కెరీర్‌పై నిర్ణయం తీసుకోవాల్సిందిగా సూచించినట్లు సమాచారం. రోహిత్ శర్మ వయసుతో పాటు.. 2027 వన్డే వరల్డ్‌కప్ నాటికి జట్టును సన్నద్ధం చేసే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ మేర అతడితో చర్చించినట్లు తెలుస్తోంది. ఈ విషయం గురించి బీసీసీఐ వర్గాలు టైమ్స్ ఆఫ్ ఇండియాతో మాట్లాడుతూ.. "ఇంగ్లండ్‌తో వన్డేలు, చాంపియన్స్ ట్రోఫీకి జట్టును ఎంపిక చేసిన సమయంలో సెలక్టర్లు, బోర్డు పెద్దలు రోహిత్ శర్మతో సుదీర్ఘ చర్చలు జరిపారు.

చాంపియన్స్ ట్రోఫీ ముగిసిన తర్వాత భవిష్యత్ గురించి నిర్ణయం తీసుకోవాల్సిందిగా సూచించారు. రానున్న వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ సీజన్‌కు.. అదే విధంగా వన్డే ప్రపంచకప్ టోర్నీకి జట్టును సిద్ధం చేసే విషయంలో యాజమాన్యానికి కొన్ని స్పష్టమైన ప్రణాళికలు ఉన్నాయి.

### కోహ్లికి మాత్రం గ్రీన్‌సిగ్నల్?!

కాబట్టి ఇప్పటి నుంచే జట్టు పరివర్తనపై దృష్టి పెట్టింది. అన్నీ సజావుగా సాగేలా జాగ్రత్తలు తీసుకుంటోంది" అని పేర్కొన్నాయి. అయితే, మరో దిగ్గజ బ్యాటర్, 36 ఏళ్ల విరాట్ కోహ్లి విషయంలో మాత్రం బీసీసీఐ మరికొన్నాళ్ల పాటు వేచిచూడాలనే ధోరణితో ఉన్నట్లు తెలుస్తోంది. అతడికి మరిన్ని అవకాశాలు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు బోర్డు సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక రోహిత్ శర్మతో పాటు విరాట్ కోహ్లి ప్రస్తుతం ఇంగ్లండ్‌తో వన్డేతో సిరీస్‌తో బిజీగా ఉన్నారు. ఇరుజట్ల మధ్య నాగ్‌పూర్‌లో గురువారం తొలి వన్డేతో మూడు మ్యాచ్‌ల సిరీస్ మొదలుకానుంది. అంతకుముందు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో టీమిండియా ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌ను 4-1తో గెలుచుకుంది.

# సౌతాఫ్రికా టీ20 లీగ్ ఫైనల్లోకి ముంబై ఇండియన్స్

ముంబై ఇండియన్స్ ఫ్యామిలీకి చెందిన ఎంఐ కేప్‌టౌన్ తొలిసారి సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో (%బూు%20 2025) ఫైనల్‌కు చేరింది. నిన్న (ఫిబ్రవరి 4) జరిగిన తొలి క్వాలిఫయర్‌లో ఎంఐ కేప్‌టౌన్ పార్ల్ రాయల్స్‌పై 39 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఎంఐ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. ప్రస్తుత సీజన్‌లో ఎంఐకు ఇది మూడో అత్యధిక స్కోర్.

ముంబై ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు ర్యాన్ రికెల్టన్ (27 బంతుల్లో 44బీ 4 ఫోర్లు, 2 సిక్సర్లు), వాన్ డర్ డస్సెన్ (32 బంతుల్లో 40బీ 3 ఫోర్లు, 2 సిక్సర్లు) సహా డెవాల్డ్ బ్రెవిస్ (30 బంతుల్లో 44 నాటౌట్‌బీ 4 సిక్సర్లు), జార్జ్ లిండే (14 బంతుల్లో 26బీ 3 సిక్సర్లు), డెలానో పోట్‌గెటర్ (17 బంతుల్లో 32 నాటౌట్‌బీ 4 ఫోర్లు, సిక్స్) రాణించారు. రాయల్స్ బౌలర్లలో దునిత్ వెల్లలగే 2, ఫోర్టుయిన్, డేవిడ్ గేలియమ్ తలో వికెట్ పడగొట్టారు.

200 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన రాయల్స్.. ఎంఐ బౌలర్లు కలిసికట్టుగా సత్తా చాటడంతో 19.4 ఓవర్లలో 160 పరుగులకే ఆలౌటైంది. ట్రెంట్ బౌల్ట్, కగిసో రబాడ, కార్బిన్ బాష్, కెప్టెన్ రషీద్ ఖాన్ తలో రెండు వికెట్లు పడగొట్టగా.. జార్జ్ లిండే ఓ వికెట్ దక్కించుకున్నాడు. రాయల్స్ ఇన్నింగ్స్‌లో డేవిడ్ మిల్లర్ (45) టాప్ స్కోరర్‌గా నిలువగా.. దినేశ్ కార్తీక్ (31) ఓ మోస్తరు స్కోర్ చేశాడు.




ఛేదనలో రాయల్స్ ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. ఈ మ్యాచ్‌లో రెండు వికెట్లు తీసిన రషీద్ ఖాన్ టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అవతరించాడు. ఈ మ్యాచ్‌లో ఓడినా ఫైనల్‌కు చేరేందుకు రాయల్స్‌కు మరో అవకాశం ఉంటుంది. రేపు (ఫిబ్రవరి 6) జరుగబోయే క్వాలిఫయర్-2లో రాయల్స్.. ఎలిమినేటర్ మ్యాచ్‌లో విజేతతో తలపడుతుంది.

ఇవాళ (ఫిబ్రవరి 5) జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సన్‌రైజర్స్ ఈస్ట్రన్‌కేప్.. జోబర్గ్ సూపర్‌కింగ్స్‌తో తలపడనుంది. గత రెండు సీజన్లలో టేబుల్ లాస్ట్‌లో నిలిచిన ఎంఐ కేప్‌టౌన్ తొలిసారి ఫైనల్‌కు చేరింది. సన్‌రైజర్స్ ఈస్ట్రన్‌కేప్ సౌతాఫ్రికా టీ20 లీగ్ రెండు ఎడిషన్లలో విజేతగా నిలిచింది.

# ఇదేం పద్ధతి?: రోహిత్ శర్మ ఆగ్రహం

భారత టెస్టు, వన్డే క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మకు కోపం వచ్చింది. తన ఫామ్ గురించి ప్రశ్నించిన విలేకర్ల తీరుపై అతడు అసహనం వ్యక్తం చేశాడు. ఇలాంటి పనికిరాని ప్రశ్నలు ఎందుకు అడుగుతున్నారని అతడు అసహనానికి లోనయ్యాడు . అదే విధంగా.. తన రిటైర్మెంట్ గురించి వస్తున్న ఊహాగానాలపై కూడా రోహిత్ శర్మ ఘాటుగా స్పందించాడు.




గత కొంతకాలంగా టెస్టుల్లో రోహిత్ శర్మ విఫలమవుతున్న విషయం తెలిసిందే. తొలుత స్వదేశంలో న్యూజిలాండ్‌తో సిరీస్‌లో.. అనంతరం ఆస్ట్రేలియా గడ్డ మీద అతడి వైఫల్యాల పరంపర కొనసాగింది. ప్రతిష్టాత్మక బోర్డర్- గావస్కర్ ట్రోఫీలో ఈ ముంబైకర్ ఐదు ఇన్నింగ్స్ ఆడి కేవలం 31 పరుగులే చేశాడు.

ఈ క్రమంలో తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తగా ఇటీవల ముంబై ఓపెనర్‌గా రంజీ ట్రోఫీ బరిలో దిగాడు రోహిత్ శర్మ. అయితే, అక్కడా 'హిట్‌మ్యాన్'కు చేదు అనుభవమే ఎదురైంది. జమ్మూ కశ్మీర్‌తో మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో మూడు, రెండో ఇన్నింగ్స్‌లో 28 పరుగులకే అతడు పరిమితమయ్యాడు.

### అసలు ఇదెలాంటి ప్రశ్న?

ఇదిలా ఉంటే.. ప్రస్తుతం రోహిత్ శర్మ ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్(%×అసఋ జం జుఅస్త్రశ్రీఖఅస%)కు సిద్ధమయ్యాడు. ఇరుజట్ల మధ్య గురువారం నాగ్‌పూర్ వేదికగా తొలి వన్డే జరుగనుంది. ఈ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన రోహిత్ శర్మకు తన పేలవ ఫామ్ గురించి ప్రశ్న ఎదురైంది. ఇందుకు బదులిస్తూ.. "అసలు ఇదెలాంటి ప్రశ్న?.. ఆ ఫార్మాట్(టెస్టు) వేరు.. ఇది వేరు.

దానికీ.. దీనికీ పోలిక ఎందుకు తెస్తున్నారు?" అని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అదే విధంగా.. "క్రికెటర్లుగా మా కెరీర్‌లో ఎత్తుపల్లాలు సహజం. నా ప్రయాణంలో ఇలాంటివెన్నో చూశాను. నాకు ఇదేమీ కొత్త కాదు. ప్రతిరోజూ సరికొత్తదే. అలాగే ఆటగాడిగా నాకు ప్రతి సిరీస్ ఒక తాజా ఆరంభాన్ని ఇస్తుంది" అని రోహిత్ శర్మ సానుకూల దృక్పథంతో మాట్లాడాడు.